


స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్‌ను శుక్రవారం జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కె.శ్రీనుబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్‌లో సీసీ కెమెరాలకు నిత్యం విద్యుత్ సరఫరా నిత్యం ఉండేలా చూడాలన్నారు. ఈ పరిసరాల్లో ఎటువంటి వ్యర్థ పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రాకపోకలకు ఒకే మార్గం ఉండాలని ఆదేశించారు. ఇతర మార్గాలను మూసివేయలన్నారు. ఈ పరిశీలనలో రెవెన్యూ అధికారులు, రోడ్లు భవనాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్లీజ్.. ఒక్క క్షణం

- ఆలోచిస్తే భవిష్యత్ అంతా మీదే
- క్షణికావేశంతో విద్యార్థుల బలవన్మరణాలు
- ఒత్తిడిని తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్న వైనం
- మార్కులు ఒక్కటే జీవితం కాదు
- మానసిక వైద్యుల సూచనలు తీసుకుంటే మేలు



విద్యార్థులారా! ఒక్క క్షణం ఆలోచించండి. క్షణికావేశంలో మీరు తీసుకుంటున్న నిర్ణయాలు మీ కుటుంబాలను అగాథంలోకి నెడుతున్నాయి. చదువులో వెనుకబడిపోయామని, మార్కులు రావడం లేదని, ర్యాంకులు కొట్టలేకపోతున్నామని, పరీక్షలు తప్పామని, ఉద్యోగాలు రాలేదని ఆత్మహత్యలు చేసుకోవద్దు. బతకడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఆ మార్గాలను అన్వేషించండి. మార్కులను కొలమానంగా తీసుకోవద్దు. ఒత్తిడిని అధిగమిస్తే ఉజ్వల భవిష్యత్ మీదే.

(విజయనగరం/పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల వ్యవధిలోనే ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. క్షణికావేశంలో వారు తీసుకున్న నిర్ణయాలు ఆ కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెట్టాయి. ప్రధానంగా 18-35 సంవత్సరాల మధ్య ఉన్న యుక్త వయస్సుల వారే క్షణికావేశానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఒత్తిడికి గురై పరీక్షలు బాగా రాయలేమనో.. పరీక్ష తప్పుతామనో.. తోటి స్నేహితులతో పోటీ పడలేకపోతున్నామనో భావిస్తున్నారు. తల్లిదండ్రుల నుంచి ఛీత్కారాలు ఎదురవుతాయన్న భయం కూడా వారిని వెంటాడుతుంటోంది. దీంతో క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయం వారి జీవితాలను అగాథంలోకి నెడుతున్నాయి. బలవన్మరణాలకు దారి తీస్తున్నాయి.

ఒత్తిడే కారణం..

ప్రస్తుతం ఎక్కడ చూసినా మానసిక ఒత్తిడి అనేది సహజ సమస్యగా మారింది. ముఖ్యంగా విద్యార్థుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో ఉజ్వల భవిష్యత్‌కు దారితీయాల్సిన చదువులు చావుకు కారణమవుతున్నాయి. కొందరు తల్లిదండ్రులు కూడా చదువు కోసం పిల్లలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. తోటివారితో పోలిక పెడుతున్నారు. 'మీ స్నేహితులు బాగా చదివి ఎక్కువ మార్కులు తెచ్చుకుంటున్నారు. వారితో పోటీ పడలేకపోతే నీవెందుకు. జీవితంలో బాగుపడే లక్షణాలు లేవా' అంటూ తిడుతున్నారు. విద్యా సంస్థలు కూడా విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అయితే కనీసం విద్యార్థులకు విశ్రాంతి లేకుండా ఒత్తిడికి గురి చేస్తున్నాయి. దీంతో భరించలేక విద్యార్థులు తనువు చాలిస్తున్నారు.

- విజయనగరం జిల్లా డెంకాడ మండలం సమీపంలోని జొన్నాడ లేఅవుట్‌లో ఈ నెల 19న షేక్‌లాల్ మజాక్ (21) అనే ఇంజనీరింగ్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్టీఆర్ జిల్లా నందిగాం గ్రామానికి చెందిన మజాక్ డెంకాడలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువును పూర్తి చేశాడు. అయితే, కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో మళ్లీ పరీక్షలు రాసేందుకు ఇక్కడకు వచ్చాడు. ఒత్తిడి తట్టుకోలేకపోయాడో, మరే కారణమో తెలియదు గానీ ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.
- పార్వతీపురం పట్టణానికి చెందిన శ్రేయష్ (17) అనే విద్యార్థి ఈనెల 21న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న శ్రేయష్ తాను చదువులో బాగా వెనుకబడినట్లు తోటి విద్యార్థులతో తరచూ చెప్పేవాడు. ఇటీవల రాసిన పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తాయన్న భయంతో వత్తిడికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- పార్వతీపురం పట్టణంలోని కుసుంగిడ్డ వీధికి చెందిన విద్యార్థి కె.తారకేశ్వరరావు ఈనెల 19న ఆత్మహత్య చేసుకున్నాడు. తారకేశ్వరరావు ఇంటర్ పూర్తి చేసిన తరువాత విజయనగరం సమీపంలోని ఓ ప్రైవేట్ విశ్వ విద్యాలయంలో బీటెక్‌లో చేరాడు. అయితే మొదటి సంవత్సరంలో చదువులో వెనుకబడుతున్నానని భావించి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

మార్కులు కొలమానం కాకూడదు..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ద్వారా మేథోపరమైన సామర్థ్యాలకు ప్రాధాన్యం కల్పిస్తోంది. విద్యార్థులు ఏ రంగంపై, ఏ సబ్జెక్టుపై ప్రతిభ కనబరుస్తున్నారో గుర్తించాల్సి ఉంది. దీనికి అనుగుణంగా విద్యను అందించాలి. వృత్తి పరమైన, స్కిల్ డెవలెప్‌మెంట్ వంటి అవకాశాలు ఉన్నాయని, మార్కులు ఒక్కటే జీవితానికి గీటురాయి కాదని, మార్కులు సాధించిన వారంతా మంచి స్థాయిలో ఉంటారు అనుకోవటం పొరపాటు అని, బతికేందుకు అనేక అవకాశాలున్నాయని ఇలా విద్యార్థులకు జీవితంపై అవగాన కల్పించాల్సి ఉంది. కానీ, చాలా విద్యా సంస్థలు వీటిని పట్టించుకోవడం లేదు. ఎంతసేపూ మార్కులే కొలమానంగా బోధన సాగిస్తున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

విద్యార్థులకు కౌన్సిలింగ్ అవసరం..

డిప్రెషన్, ఒత్తిడి, జీవితంపై నిరాసక్తత, జీవితంలో ఏమీ సాధించలేమన్న ఆలోచన, భవిష్యత్ అంధకారంగా కన్పించడం, తమకు తోడుగా నిలిచే వారు ఎవరూ లేరనే భావన, తదితర అంశాలు విద్యార్థుల్లో ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయి. విద్యార్థుల్లో ఎక్కువ శాతం మందికి ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదు. అందుచేత అన్ని విద్యా సంస్థల్లోనూ తరచుగా సైక్రియాటిస్టు నిపుణులతో కౌన్సిలింగ్ నిర్వహించడం అవసరం. ఆత్మహత్య సంకేతాలను గుర్తు పట్టడం తదితర అంశాలపై అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి. విద్యార్థులకు మార్కులే కొలమానం కాకుండా మేథో పరమైన సామర్థ్యాలకు విలువ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

-డాక్టర్ జె.రమేష్, సైక్రియాటిస్టు, విజయనగరం



పోలీసులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

బైండోవర్ చేయాలి

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: ఎన్నికల నేపథ్యంలో పాలకొండ నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో బైండోవర్ చేయాలని రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నియోకవర్గ స్థాయి పోలీస్ అధికారులతో చర్చించారు. పోలింగ్ కేంద్రాల వారీగా బందోబస్తు ఏర్పాట్లపై ముందే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆమె సూచించారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చెక్‌పోస్టుల వద్ద పట్టుబడిన నగదు వివరాల నివేదికను ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అందించాలని తెలిపారు. అనంతరం ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులకు ఆమె శిక్షణ ఇచ్చారు. పోలింగ్ రోజు నిర్వహించే విధులు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతంపేట తహసీల్దార్ సోమేశ్వరరావు, సీఐ చంద్రమౌళి తదితరులున్నారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు

- డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి, మార్చి 22 : గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడుతున్నామని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఉల్లిభద్రలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు రాజకీయ కక్షలకు దూరంగా ఉండాలని, స్నేహభావంతో మెలగి తమ ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. విధిగా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందుగా గుర్తించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం ప్రధాన రహదారులతో పాటు పలు వీధుల్లో సాయుధ పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ ర్యాలీలో గరుగుబిల్లి ఎస్ఐ వై.అమ్మన్నరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉల్లిభద్రలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వెల్లడి

పార్వతీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి అని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. ఎన్నికల నిర్వహణపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు చేసే ఇంటింటా ప్రచారంతో సహా ఎటువంటి కార్యక్రమానికైనా అనుమతులు ఉండా లన్నారు. నేరుగా గాని, పోర్టల్ ద్వారా గాని అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఎన్ ఫోర్స్ మెంట్ ఏజెన్సీలను అప్రమత్తం చేయాలని, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కెమెరా తో పాటు స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు ఆయా శాఖల ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఫారం-7, 8లను ఈ నెల 26 లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో కేశవ నాయుడు, ఆర్డీవోలు హేమలత, ఎ.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఇతర శాఖల అధికారులు

అవెక్కడా కనిపించరాదు: కలెక్టర్

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలాలు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన కార్డులు మొదలైన వాటిల్లో సీఎం, మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల ఫొటోలు, సందేశాలు ఉండరాదని కలెక్టర్ నిశాంత్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులతో ఆయన మాట్లాడుతూ.. నియమావళికి ముందు పంపిణీ చేసిన కార్డులు, ఆవిష్కరించిన శిలాఫలకాలు తదితర అంశాల్లో ఉన్న ఫొటోలకు సంబంధించి ఎటువంటి జోక్యం అవసరం లేదన్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి మంత్రులు అధికారిక వాహనాలను ఉపయోగించడం పూర్తి నిషేధమని తెలిపారు. షెడ్యూల్ ప్రకటనకు ముందు క్షేత్రస్థాయిలో ప్రారంభమైన కార్యక్రమాలు కొనసాగించొచ్చన్నారు. మైదానాలు వంటి బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలను నిర్వహించడానికి అభ్యర్థులు అనుమతులు తీసుకోవాలని చెప్పారు. సంబంధిత అధికారుల ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా బహిరంగ సభలు, ఊరేగింపులతో లౌడ్ స్పీకర్లను ఉపయోగించరాదన్నారు. పోస్టర్లు, జెండాలు, చిహ్నాలు లేదా ఇతర ప్రచార సామగ్రి, గుర్తింపు స్లిప్పుల తదితర వాటిని పోలింగ్ బూత్‌ల సమీపంలో , ఓటింగ్ రోజున ప్రదర్శించరాదన్నారు. ఇతర పార్టీల అభ్యర్థుల పోస్టర్లను తొలగించరాదని తెలిపారు. ఊరేగింపుల్లో ఆయుధాలు ఉండరాదని వెల్లడించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాల లేదా ఏదైనా ప్రార్థనా స్థలాల్లో ఎన్నికల ప్రచారాలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

రహదారిపై ఏనుగులు

- బెంబేలెత్తిపోయిన ప్రజలు



రహదారి పక్కన చెట్టు నీడలో గజరాజులు

జియ్యమ్మవలస, మార్చి 22 : మండలంలో పెదమేరంగి కూడలి - గంగమ్మపేట గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శుక్రవారం ఏనుగులు సంచరించాయి. దీంతో వాహనచోదకులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోయారు. గజరాజులు ఎవరిపై దాడి చేస్తాయోనని ఆందోళన చెందారు. కాగా ఉదయం బిత్రపాడు, సీమనాయుడువలస గ్రామాల మధ్య సంచరించిన ఏనుగులు సాయంత్రానికి పెదమేరంగి కూడలికి సమీపంలో రోడ్డుపై దర్శనమిచ్చాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపటి తర్వాత అవి సమీపంలోని పొలాల్లోకి వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. యథావిధిగా రాకపోకలు సాగించారు. కాగా దీనిపై అటవీశాఖ అధికారులు స్పందించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

క్షేత్రస్థాయికి వెళ్లి జ్వరాలను గుర్తించండి

- మలేరియా జోనల్ అధికారి శాంతిప్రభ

పార్వతీపురం టౌన్, మార్చి 22: క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి జ్వరాలను గుర్తించాలని మలేరియా జోనల్ అధికారి ఎం.శాంతి ప్రభ సూచించారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీవో భవనంలో జిల్లా మలేరియా అధికారి టి.జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆరోగ్య పర్యవేక్షకులు, సహాయకులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం.. క్షేత్రస్థాయి సిబ్బంది జ్వరాల సర్వేను చేపడితే.. రోగులకు త్వరగా చికిత్స అందించడం వీలవుతుందని చెప్పారు. దోమలు వృద్ధి చెందే స్థావరాలను గుర్తించి, నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న సీజన్లలో జ్వరాలను అదుపులో ఉంచేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణకు సంబంధించి ప్రతిఒక్క అంశాన్ని వివరణాత్మంగా జిల్లా మలేరియా అధికారి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మలేరియా జోనల్ అధికారి

కట్టుకున్న వాడే కడతేర్చాడు

- మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త
- అనుమానమే కారణమా?
- పరారీలో నిందితుడు

జియ్యమ్మవలస, మార్చి 22: కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు. మద్యం మత్తులో భార్యను హతమార్చాడు. శుక్రవారం వేకువ జామున సింగనాపురంలో జరిగిన ఈ ఘటనలో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంట ముసలినాయుడు మద్యానికి బానిసై భార్య అప్పలనర్సమ్మ (54)తో రోజూ గొడవ పడుతూ ఉండేవాడు. కాగా వారికి ముగ్గురు సంతానం. అందరికీ వివాహాల య్యాయి. పెద్దకుమార్తె సీతంపేటలో, చిన్న కుమార్తె ఇటిక గ్రామంలో ఉంటున్నారు. కుమారుడు తన భార్యా పిల్లలతో నెల్లూరులో ఉండగా.. అక్కడొక మిల్లులో పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా భర్త వేధింపులను భరించలేకపోయిన అప్పలనరసమ్మ నెల రోజుల కిందట తన ఇద్దరు కుమార్తెల వద్దకు వెళ్లిపోయింది. అయితే తన భార్యను ఏమి చేయనని, బాగా చూసుకుంటానని చెప్పిన ముసలినాయుడు పెద్దలను నమ్మించాడు. ఈ మేరకు బుధవారం ఇటిక గ్రామంలో ఉంటున్న చిన్న కుమార్తె ఇంటి నుంచి భార్యను స్వగ్రామానికి తీసుకొచ్చాడు. అయితే రెండు రోజులు కాకముందే భార్యను కొడవలితో హతమార్చి ముసలినాయుడు పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో డీఎస్పీ కృష్ణారావు, చినమేరంగి సీఐ మంగరాజు, ఎస్ఐ చిన్నంనాయుడు, ఏఎస్ఐ కాసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి.. హత్యకు గల కారణాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మద్యం, అనుమానమే హత్యకు ప్రధాన కారణాలని నిర్ధారణకు వచ్చారు. క్లూస్ టీమ్ మృతదేహాన్ని, ఇంటిని పరిశీలించి కీలక ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం అప్పలనరసమ్మ మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. నిందితుడిని పట్టుకొనేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.



అప్పలనర్సమ్మ (ఫైల్)



ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



పరారీలో ఉన్న నిందితుడు ముసలినాయుడు

వీడని ఉత్కంఠ

- పాలకొండపై కొనసాగుతున్న సస్పెన్స్
- ఎవరికి టిక్కెట్ కేటాయిస్తారో?

పార్వతీపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై ఉత్కంఠ వీడడం లేదు. టిక్కెట్ ఎవరికి కేటాయిస్తారన్న సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. శుక్రవారం టీడీపీ అధిష్ఠానం మూడో జాబితాను విడుదల చేసింది. ఇందులో పాలకొండకు చోటు దక్కలేదు. దీంతో పాలకొండలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి ఎవరు పోటీ చేస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా ఈ నియోజకవర్గంలో టీడీపీకి బలమైన క్యాడర్ ఉంది. పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలెంతోమంది ఉన్నారు. అయినా నేటివరకు అభ్యర్థి ఎవరనేది ప్రకటించ లేదు. మూడో జాబితాలో కూడా పాలకొండ పేరు లేకపోవడం, ఈ నియోజకవర్గం నుంచి ఎవరు పూర్తి చేస్తారో తెలియకపోవడంతో కూటమి శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఈ సీటు టీడీపీకి లేదా జనసేన పార్టీకి కేటాయిస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏదేమైనా మరికొద్ది రోజుల్లో పాలకొండతో పాటు అరకు ఎంపీ స్థానంపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కోళ్ల ఇంటి వద్ద కార్యకర్తల సందడి

● ఎస్.కోట ఎమ్మెల్యే సీటు లలితకుమారికి ప్రకటించడంతో టీడీపీ శ్రేణుల సంబరాలు

లక్కవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కోళ్ల లలితకుమారి పేరు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించడంతో ఎల్.కోటలో సంబరాలు మిన్నంటాయి. ఐదు మండలాల కార్యకర్తలతో లలితకుమారి ఇంటి ప్రాంగణం జనసంద్రంగా మారింది. మందుగుండు, డిజేల శబ్దాలతో కార్యకర్తలు సందడిచేశారు. లలితకుమారికి జనసేన సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ కార్యకర్తలతో కలిసి అభినందించారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తనకు టిక్కెట్టు కేటాయించినందుకు అధినేత చంద్రబాబుకు, మా కుటుంబంపై నమ్మకం ఉంచినందుకు పార్టీ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ అభ్యర్థి భరత్‌తోపాటు ఎస్.కోట నియోజకవర్గ సీటును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తానని చెప్పారు. సోదరుడు గొంప కృష్ణతో కలిసి గ్రామగ్రామానికి వెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేటీపీ రాంప్రసాద్, కరెడ్ల ఈశ్వరరావు, మల్లునాయుడు, రమణమూర్తి, బంగారు రమేష్, కల్లద్దాల శ్రీను పాల్గొన్నారు.



లలితకుమారి ఇంటి ముందు సంబరాలు చేసుకుంటున్న కార్యకర్తలు

అడుగడుగునా సిద్ధం పోస్టర్లు

● ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా తొలగించని వైనం

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అటకెక్కుతోంది. అడుగడుగునా వైసీపీ ప్రభుత్వ పథకాల పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. ఇటీవల ఆర్భాటంగా నిర్వహించిన సిద్ధం సభల పోస్టర్లు ఆటోలు, వాహనాలపై బహిరంగంగా కనిపించేలా ఉన్నా తొలగించకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ రవాణా వాహనాలపై వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన రంగులు, గుర్తులు, పోస్టర్లు, స్టిక్కర్లు అతికించి ఉంటే ఎన్నికల అధికారులు కేసులు నమోదుచేయాల్సి ఉంది. ఈనెల 17వ తేదీ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన స్లోగన్‌లతో కూడి స్టిక్కర్లు, గుర్తులుపై జిల్లా ఎన్నికల అధికారులు నిఘాపెట్టాల్సిఉంది.



విజయనగరంలో సిద్ధం స్టిక్కర్లతో తిరుగుతున్న ఆటో

ప్రభుత్వ వైఫల్యాలు వివరించాలి

● మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న ప్రసాదుల కనకమహాలక్ష్మి

విజయనగరం రూరల్: ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి కోరారు. శుక్రవారం విజయనగరంలోని ఏడో డివిజన్‌లో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సూపర్‌సిక్స్ హామీలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులే గెలిపిస్తాయి

● రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్



వంగర: నాయకులతో మాట్లాడుతున్న కోండ్రు

వంగర: ప్రజల ఆశీస్సులే తనను గెలిపిస్తాయని రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం వంగరలో టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావు, రుషింగిలో ఎలకల రాజగోపాలరావుతో పాటు పలుగ్రామాల్లో నాయకులను కలిశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాయకులు అధినాయకుడి ఆదేశాలను పాటించాలన్నారు. టీడీపీ నాయకులు ఎల్.కృష్ణమూర్తి, ధనలక్ష్మి, పి.లక్ష్మణ పాల్గొన్నారు.

మూడురోజుల వ్యవధిలో అన్నదమ్ముల మృతి

● రోడ్డు ప్రమాదంలో తమ్ముడు .. గుండెపోటుతో అన్నయ్య

● బొబ్బిలి మంగళవీధిలో విషాదం



మహేశ్, రామారావు(ఫైల్)

బొబ్బిలి: బొబ్బిలిలోని మంగళవీధిలో విషాదం చోటుచేసుకుంది. ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మూడు రోజుల కిందట మృతి చెందడంతో ఆయన దినకర్మలు చేసుకుని ఇంటికి చేరుకున్న అన్నగుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. మూడు రోజుల వ్యవధిలో అన్నదమ్ముల మృతితో ఆ ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బొబ్బిలి మంగళవీధికి చెందిన కెంగువ మహేశ్ (52) హోంగార్డుగా పార్వతీపురం ఆర్టీఏ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. బొబ్బిలి నుంచి ఇటీవల బదిలీపై వెళ్లాడు. ఇంతలో తన సోదరుని మూడోరోజు కార్యక్రమం ముగించుకుని ఇంటికి చేరుకున్న మహేశ్ గుండెపోటురావడంతో అస్వస్థతకు గురయ్యాడు.వెంటనే బొబ్బిలి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా అక్కడ ఆయన మృతిచెందాడు. ఆయనకు భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, అన్నయ్య శంకర్, తండ్రి తాతలు ఉన్నారు. మహేశ్ తమ్ముడు రామారావు ఈనెల 17న విజయనగరంలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ ఈనెల 19న మృతిచెందిన విషయం విదితమే. రామారావు మూడోరోజు దినకర్మలను శుక్రవారం ముగించుకుని ఇంటికి రాగానే మహేశ్ గుండెపోటుతో మృతి చెందడంతో ఇంటిలో రోదనలు మిన్నంటాయి. కాగా హోంగార్డు కెంగువ మహేశ్, ఆయన సోదరుడు రామారావు మూడురోజుల వ్యవధిలో మృత్యువాతపడడం చాలా బాధాకరమని టీడీపీ నేత బేబీనాయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మృతుల తండ్రి తాత, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇద్దరి చైన్‌స్నాచర్ల అరెస్ట్

విజయగనగరంక్రైం: ఇద్దరి చైన్‌స్నాచర్లను అరెస్ట్‌చేసినట్లు విజయనగరం వన్ టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి బంగారు గోలుసును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీఐ కథనం మేరకు.. విజయనగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తోటపాలెం ఎయిమ్స్ స్కూల్ సమీపంలో ఈనెల 21న పశువులు మేపుతున్న వృద్ధురాలు బంక గురుమూర్తమ్మ మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకుని బైక్‌పై పరారయ్యారు. దీంతో బాధితురాలు ఫిర్యాదుమేరకు క్రైంఎస్ఐ జె.తారకేశ్వరావు క్రైంసిబ్బంది. సంఘటనస్థలంలో దర్యాప్తు చేశారు. ఈమేరకు పూసపాటిరేగ చాకలివీధికి చెందిన మామిడి సత్యకుమార్ గురాన భార్గవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు చైన్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లోనే కేసును చేధించిన ఎస్ఐ తారకేశ్వరావు, హెచ్‌సీ ఆచ్చిరాజు,పీసీలు శివ గౌరిశంకర్‌ను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించినట్లు సీఐ తెలిపారు. కాగా గత నెలలో వేంకటేశ్వరాలయం సమీపంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్లు అంగీకరించారని సీఐ తెలిపారు.

ఆలయ హుండీలో చోరీ

రాజాం రూరల్:పట్టణంలోని సారధిరోడ్‌లో వైఎస్సార్ పార్క్‌లో గల ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం ప్రధానగేటు గ్రిల్స్‌ను విరగ్గొట్టి హుండీలోని మొత్తాన్ని చోరీ చేశారు. శుక్రవారం ఉదయం జాగింగ్‌కు వెళ్లిన వారంతా గేటు విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ రవికిరణ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలంలో పరిశీలించారు. క్లూస్‌టీం ఆలయం లోపల, వెలుపల వేలిముద్రలు సేకరించింది. ఈమేరకురాజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాడంగిలో వ్యాన్ బోల్తా

బాడంగి:బాడంగి ఎత్తుఖాణా వద్ద పుచ్చకాలు తరలిస్తున్న వ్యాన్ బోల్తాపడింది. గురువారం రాత్రి కురుపాం నుంచి రావులపాలెం పదిటన్నుల పుచ్చలకాయల లోడుతో వెళ్తున్న లారీ బాడంగి ఎత్తు బ్రిడ్జిపై డిజిల్ అయిపోవడంతో ఆగిపోయింది. దీంతో డీజిల్ కోసం డ్రైవర్ రామభద్రపురం వెళ్లి వచ్చేలోగా ఎత్తున ఉన్న లారీ కిందకు జారుకొని పడిపోయినట్లు పుచ్చకాయలు తరలిస్తున్న వ్యాపారి గంగారావు తెలిపారు. కురుపాంలో టన్ను రూ.10వేలు చొప్పున పది టన్నులు లక్ష రూపాయలకు కొనుగోలు చేసి తరలింపునకు విజయవాడకు చెందిన లారీకి రూ.20 వేలకు బేరం కుదుర్చుకున్నట్లు చెప్పారు. కురుపాం నుంచి బొబ్బిలి వయా పారాది మీదుగా వెళ్లాల్సిఉంది. అయితే పారాది బ్రిడ్జి పాడవడంతో కురుపాం నుంచి తెర్లాం మీదుగా బాడంగి వస్తుండగా వ్యాన్ బోల్తాపడినట్లు గంగారావు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: సీఐ



విజయనగరం క్రైం: పూల్‌బాగ్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ రామారావు

విజయనగరం క్రైం: విజయనగరంలోని పోలీసుస్టేషన్ల పరిధిలో ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని టూటౌన్ సీఐ కోరాడ రామారావు హెచ్చరించారు. శుక్రవారం టూటౌన్ పరిధిలోని పూల్‌బాగ్, ఖాదర్‌నగర్, బాబామెట్ట, దాసన్నపేట ప్రాంతాల్లో కేంద్ర బలగాలు, సివిల్ పోలీసులు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించండి

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు కోరారు.మండలంలోని రొంపల్లి, ఎస్.సీతారాంపురం, కొట్టక్కిల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

బేబీనాయన విజయానికి పనిచేయాలి

● బొబ్బిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి



మాట్లాడుతున్న గిరడ అప్పలస్వామి

బొబ్బిలి: నియోజకవర్గ టీడీపీ, జనసేన,బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బేబీనాయన విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి పిలుపునిచ్చారు.శుక్రవారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ జనసేనలో ఎటువంటి విభేదాలు లేవన్నారు.కొంతమంది స్వలాభం కోసం జన సైనికులను వాడుకుని డేటాకలెక్షన్‌చేస్తూ పక్క పార్టీలకు అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు.పార్వతీపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఆదాడ మోహ నరావు మాట్లాడుతూ పార్టీని వినియోగించుకుని జనసైనికులను ప్రలోభపె డుతున్న వారిని నమ్మవద్దన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పెద్దింటి మనోజ్ కుమార్, మొకర సాయిశంకర్, బంటుపల్లి శంకరరావు, దివ్య, దాకారపు చంద్ర మౌళి, చిక్కాల సందీప్, పైల హరిప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



ప్రకాష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బేబీనాయన,తెంటు

తెర్లాం:కాగాంలో ఇటీవల టీడీపీ నాయకులు గర్బాపు ప్రకాష్ మృతిచెందడంతో కుటుంబ సభ్యులను శుక్రవారం టీడీపీ కుటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్ముంనాయుడు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు,రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేష్, నాయకులు గర్బాపు రామారావు, జగ్గరాజు, అప్పలనరసింహరాజు పాల్గొన్నారు.

వ్యాగన్ లోడింగ్ కేంద్రాన్ని తరలిస్తే పోరాటం

● పట్టణ కళాసీసంఘం కార్యదర్శి దంతులూరి వర్మ



మాట్లాడుతున్న దంతులూరి వర్మ

బొబ్బిలి:బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో 40ఏళ్ల నుంచి నిర్వహిస్తున్న వ్యాగన్ లోడింగ్, అన్‌లోడింగ్ కేంద్రాన్ని ఇక్కడ నుంచి తరలిస్తే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని పట్టణ కళాసీసంఘం కార్యదర్శి దంతులూరి వర్మ తెలిపారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలో హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేవ్యాగన్ లోడింగ్ కేంద్రంలో 500 మంది హమాలీలు, 200 మంది మోటారు కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. టిట్లాగర్- విజయనగరం మధ్య మూడో రైల్వేలైన్ పనులుజరుగుతున్న నేపథ్యంలో బొబ్బిలి గూడ్స్ షెడ్ పాయింట్‌ను రద్దు చేయాలని అధికారులు ప్రతిపాదించారన్నారు. ఈ విషయంపై పలుసార్లు రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకువినతులు ఇచ్చినట్లు తెలిపారు. బొబ్బిలి-సాలూరు రైల్వే మార్గంలో గూడ్స్ పాయింట్‌కు అనుకూలంగా రైల్వేస్థలం ఉందని జీఎం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. సమావేశంలో పట్టణ కళాసీ సంఘం ఉపాధ్యక్షుడు అప్పారావు, సహాయకార్యదర్శి ఎరబాల అప్పారావు,రామకృష్ణ పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు



వేగావతి నదిలో గ్యాలరీవెల్‌ను పరిశీలిస్తున్న రామలక్ష్మి, ఇంజనీర్లు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా వాటర్‌వర్క్స్‌వ్యవస్థ పక్కాగా నిర్వహించి చర్యలు తీసుకోవాలని మునిసిపల్‌కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం భోజరాజపురం వాటర్‌వర్క్స్‌ను, వేగావతినదిలోగల గ్యాలరీవెల్స్‌ను ఇంజినీర్లు, ఇతర సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు.క్లోరినేషన్ నిల్వలు పరిశీలించారు. లీకేజీలను పూర్తిగా అరికట్టాలని కోరారు.

నీటి సమస్యపై చర్యలు తీసుకోవాలి

తెర్లాం: గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ,రమాదేవి, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, డిప్యూటీతహసీల్దార్ భాస్కరరావు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పౌష్టికాహారం అవసరం: సీడీపీవో

రేగిడి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాలు మెండుగా ఉన్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టి .కనక దుర్గ, సూపర్‌వైజర్ మత్తి బంగారమ్మ పేర్కొన్నారు. మండలంలోసంకిలి అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడపక్షోత్సవాలు భాగంగా కార్యకర్తలు డి.సుజాత, బి.ఇందిర, ఎం.శాంతిప్రియ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతల, కిశోరీ బాలికల ఆరోగ్యం ప్రమాణాలు తెలియజేస్తు వివిధ పోషక విలువల గల పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. అనంతరం గ్రామంలో చైతన్యర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంకిలి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సుప్రియ, మహిళాపోలీస్ స్వాతి పాల్గొన్నారు.

విశాఖ లోక్‌సభ టీడీపీ అభ్యర్థిగా శ్రీభరత్

శృంగవరపుకోట: విశాఖపట్నం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా గీతం యూనివర్సిటీ అధిపతి ఎం.శ్రీభరత్ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ నియోజకవర్గ పరిధిలో ఎస్.కోటఅసెంబ్లీ నియోజకవర్గం ఉంది. ఇప్పటికే బొత్స ఝూన్సీను వైసీపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో వీరిరువురి మధ్య పోటీ జరగనుంది. 2019 ఎన్నికల్లో కూడ ఎం.శ్రీభరత్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎస్.కోట నియోజకవర్గం నుంచి 73,414 ఓట్లను సాధించారు. వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు 81,394 ఓట్లు వచ్చాయి. వైసీపీ ఒక్క అవకాశం నినాదం వల్ల శ్రీభరత్‌కు 7,980 ఓట్లు తక్కువ పడ్డాయి. శ్రీభరత్ విశాఖ పార్లమెంట్‌కు గతంలో ప్రాతినిధ్యం వహించిన ఎంవీఎస్ మూర్తి (గోల్డ్‌స్పాట్ మూర్తి) మనమడు. ఇతని వారసునిగా రాజకీయాల్లో అడుగుపెట్టారు. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు చిన్న అల్లుడు. టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్‌కు తోడల్లుడుగా సుపరిచితుడు. శాసన సభతో పాటు పార్లమెంటును ఈ దఫా దక్కించుకోవాలన్న దృఢసంకల్పంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. శృంగవరపుకోట నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఈ పార్టీ ఆవిర్భావం తరువాత 2004 వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ప్రభావంతో ఓ సారి, తిరిగి 2019లో వైసీపీ ఒక్కచాన్స్ నినాదంతో మరో సారి ఇలా రెండు దపాలు మాత్రమే పార్టీ ప్రభావాన్ని కోల్పోయింది. మిగిలిన అన్ని సార్లు టీడీపీదే విజయం. ఈ సారీ జెండా రెపరెపలాడించాలన్న పట్టుదలతో టీడీపీ కేడర్ ఉంది.

ఘనంగా కోదండ రామాలయం ప్రతిష్ఠా మహోత్సవాలు

రాజాం రూరల్: మునిసిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో కోదండ రామాలయం ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అర్చకులు హనుమంతరావు శర్మ సారధ్యంలో శుక్రవారం ప్రత్యేకపూజలు చేశారు.టీడీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రుమురళీమోహన్ ప్రతిష్ఠాకార్యక్రమాల్లో పాల్గొనగా అర్చకులు పూజలు చేయించారు. ఆదివారం ఆలయ ప్రతిష్ఠ జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

25 వరకూ రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం

రేగిడి: మండలంలోని వన్నలిలో శనివారం నుంచి ఈనెల 25వరకు కోదండరామాలయ ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం పూజలతో కార్యక్రమాలు ప్రారంభమై 25న అన్నప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగిస్తున్నట్ల సర్పంచ్ గార రమణ, ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.యజ్ఞకర్త ఖండ్యాంకు చెందిన అంపోలు రుద్రకోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో గారపేటకు చెందిన ఆనంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీనివాసనంద సరస్వతి పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి రోజువిడిచి రోజు తాగునీరు సరఫరా

రాజాం రూరల్: రాజాం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. రేగిడి మండలంలోని బొడ్డవలస సమీపంలో నాగావళి నదిలో ఏర్పాటు చేసిన హెడ్‌వర్క్స్ వద్ద మోటారు పాడైంది. మరమ్మతులకు కనీసం వారంరోజులు సమయం అవసరం కావడంతో రాజాంలో శనివారం నుంచి రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయాలని మునిసిపల్ కమిషనర్ అప్పలనాయుడు, ఏఈ వెంకట్ నిర్ణయించారు.

డ్రైవర్ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న ఈయూ నాయకులు

శృంగవరపుకోట: డ్రైవర్ జీకే రాజు అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం శృంగవరపుకోట ఆర్టీసీ డిపో గేటు వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈనెల ఒకటో తేదీన ఎత్తుబ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్ తప్పులేదని, తక్షణమే సస్పెన్షన్‌ను ఎత్తేయాలని డిమాండ్‌చేశారు. కార్య క్రమంలో ఈయూ డిపో కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టు పొదుపుగా వినియోగించాలి



రేగిడ ఉన్నతపాఠశాల విద్యార్థులు నీటి బొట్టు ఆకారంలో ప్రదర్శన ఏర్పాటుచేసిన దృశ్యం

రేగిడి: ప్రతి నీటిబొట్టు పొదుపుగా వినియోగించాలని రేగిడి హైస్కూల్ హెచ్ఎం లక్ష్మణరావు, సైన్స్ టీచర్ ఉమామహేశ్వరి తెలిపారు. రేగిడి హైస్కూల్‌లో శుక్రవారం ప్రపంచ జలదినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు నీటిబొట్టు ఆకారంలో కూర్చొని నీటి ప్రాధ్యాన్యతను వివరించారు.

టీబీపై కార్మికులకు అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

బొబ్బిలి:స్థానిక గ్రోత్ సెంటరులోని పరిశ్రమలో కార్మికులకు ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బొబ్బిలి టీబీ యూనిట్ ఆధ్వర్యంలోవారోత్సవాల్లో భాగంగా సూపర్‌వైజరు ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవా రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా టీబీ లక్షణాల గురించి వివరించారు. కార్యక్రమంలో బలరాం పాల్గొన్నారు.

సిబ్బంది నిబంధనలు పాటించాలి: ఆర్వో

బాడంగి: ప్రభుత్వ సిబ్బంది ఎన్నికల నిబంధనలను పాటించాలని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారావు తెలిపారు. శుక్రవారం గొల్లాది, డొంకినవలస, తెంటువలస, రేజేరుల్లో మోడల్ కోడ్‌ఆఫ్ కాండాక్ట్ అమలుపై పరిశీలించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీఅధికారి సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, హెచ్‌సీ ఉమామహేశ్వరరావు,కార్యదర్శులు అల్లాడ భాస్కరరావు, బంగారుబాబు, నారాయణరావు, వీఆర్వో మహేష్, సంతు, కృష్ణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగించాలని ఫిర్యాదు

బొబ్బిలి: బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోని గొల్లపల్లిలో ఓ ఇంటిపై ఉన్న ఫ్లెక్సీని తొలగించాలని స్థానికులు అధికారులకు శుక్రవారం సాయంత్రం ఫిర్యాదుచేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎక్కడా ఎటువంటి బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉండకూడదని, తక్షణమే తొలగించాలని వారు కోరారు

'సమయపాలనతో విజయం'

రాజాం రూరల్:నిత్యజీవితంలో విద్యతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, స్వభావం, వినయం, సమయపాలనతో విజయం సాధ్యపడుతుందని కేప్ జెమిని వైస్ ప్రెసిడెంట్ వసంత తెలి పారు.శుక్రవారం రాజాంలోని జీఎంఆర్ఐటీలోకళాశాల 26వ వార్షికోత్సవం నిర్వ హించారు.కార్యక్రమంలో కాగ్నిజెంట్ హెడ్ ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ అండ్ రిలేషన్స్ అశ్వతీ వేణుగోపాల్, జీఎంఆర్ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గిరీష్, ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎంపీ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రసాద్, అసోసియేట్ డీన్స్ పాల్గొన్నారు.

విద్య కాషాయికరణను అడ్డుకోవాలి



బొబ్బిలి: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొబ్బిలి:విద్యప్రైవేటీకరణ, కాషాయికరణ జరగకుండా అడ్డుకోవడమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళవుతుందని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి తెలిపారు. శుక్రవారం బొబ్బిలిలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి మణికుమార్ పాల్గొన్నారు.

తోటపాలెంలో రక్తదాన శిబిరం

విజయనగరం దాసన్నపేట: విజయనగరంలోని తోటపాలెంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి వారోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాసుపత్రి వైద్యాధికారి శిరీష, రోటర్లీ క్లబ్ అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడుతూనే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎస్ఎఫ్ఐకే చెల్లిందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రాము, వెంకటేష్ మాట్లాడుతూ దేశంకోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగంచేసిన భగత్‌సింగ్,రాజ్‌గురు సుఖ్‌దేవ్ దారిలో ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రవికుమార్, హర్ష, వెంకి, డీవైఎఫ్ఐ ప్రతినిధులు సతీష్, రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు ఉమాబాలాజీ, నారాయణమూర్తి పాల్గొన్నారు.

25 మద్యం సీసాలు స్వాధీనం

రామభద్రపురం: రామభద్రపురంలో శుక్రవారం అక్రమంగా మద్యంతరలిస్తున్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 25 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఫెన్సింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక

విజయనగరం రూరల్:జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జరగనున్న జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ మేరకు ఎంపికైన సాయి చైతన్య, హర్షిత, కె.హితలను ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి, కోచ్‌లు అనిల్‌కుమార్ శర్మ, సతీష్‌కుమార్, పి.అప్పలరాజు అభినందించారు.

రామభద్రపురంలో చెక్‌పోస్టు ఏర్పాటు



కారును తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

రామభద్రపురం:రామభద్రపురంజంక్షన్‌లో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఏఎస్ఐ స్థాయి అధికారితోపాటు నలుగురు పోలీసులను నియమించి వాహనాలు తనిఖీచేస్తున్నారు. ఇక్కడ రామభద్రపురం నాలుగు రోడ్ల కూడలితో పాటు పక్కనే ఒడిశా,పార్వతీపురం మన్యం జిల్లా ఉండడంతో నగదు, ఓటర్లకు పంచేందుకు గిఫ్ట్ ఆర్టికల్స్ రవాణా నిరోధించే చర్యల్లో భాగంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇప్పటికే కార్లు, ఇతర వాహనాలను బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు.

కోటిపల్లిలో చెరకు పంట దగ్ధం

బాడంగి:మండలంలోని కోటిపల్లిలో నాలుగు ఎకరాల్లో చెరకు పంట శుక్రవారం దగ్ధమైంది. ఎకరన్నరలో పెద్ద చెరకు, రెండకరాల్లో మమ్ము చెరకు కాలిపోయినట్లు రైతులు పూడి శంకరరావు, గంగరాజు, మరడాన లక్షణ, అల్లు సత్యనారాయణ, మూడడ్ల కృష్ణ, రాము, పైడిపినాయుడు, అప్పలనాయుడు,గం సత్యనారాయణ, సొంగలి అప్పలనాయుడు తెలిపారు. మధ్యాహ్నం కావడంతో గాలి వీయడంతో ప్రమాదం సంభవిం చినట్లు చెప్పారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది మంటలను అదుపుచేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరికి గాయాలు

సీతానగరం: చినబోగిల గ్రామ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. చినబోగిల గ్రామానికి చెందిన చుక్క వాసు స్వగ్రామం నుంచి పార్వతీపురం వెళుతున్నాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు మరో ద్విచక్రవాహనం వస్తోంది. ఈ వాహనాలు చినబోగిల సమీపంలోకి వచ్చేసరికి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాసుకు తలపై బలమైన గాయాలు తగలడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

మద్యం స్వాధీనం

భోగాపురం: రాళ్లపాలెంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన కొయ్య చిట్టెమ్మపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సూర్యకుమారి శుక్రవారం తెలిపారు. మద్యం తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో ఆమె వద్ద నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

బైండోవర్ కేసులో మిమ్స్ ఉద్యోగులు హాజరు

నెల్లిమర్ల: ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న మిమ్స్ ఉద్యోగులపైన, పలువురు సీఐటీయూ నాయకులపైన గతంలో నమోదు చేసిన బైండోవర్ కేసుకు సంబంధించి శుక్రవారం వారిని విజయనగరం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, ఆర్డీవో ఎంవీ సూర్యకళ ముందు హాజరు పరిచినట్టు ఎస్ఐ రామగణేష్ చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకూడదని వారికి సూచించామన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

'సమ్మె చట్ట వ్యతిరేకం'



మాట్లాడుతున్న లక్ష్మీకుమార్

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు గత 50 రోజులుగా చేపట్టిన సమ్మె చట్ట వ్యతిరేకమని కార్మిక శాఖ విశాఖపట్నం జేసీఎల్ ఎ.గణేషన్ చెప్పినట్లు మిమ్స్ యాజమాన్య ప్రతినిధి, డీన్ డాక్టర్ సీహెచ్.లక్ష్మీకుమార్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమ్మె నోటీసు ఇవ్వకుండా ఉద్యోగులు మెరుపు సమ్మెకు వెళ్లడం చట్టవిరుద్ధమని జేసీఎల్ చెప్పినట్లు వెల్లడించారు. తక్షణమే సమ్మెను విరమించి విధులకు హాజరు కావాలని జేసీఎల్ ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. సమస్యల పరిష్కారానికి కార్మిక శాఖ అధికారుల సమక్షంలో చర్చల ప్రక్రియ ద్వారా కృషి చేయాలని ఆయన సూచించారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నెల్లిమర్ల: విద్యార్థుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఎంఈవో-2 ఈపు విజయ్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని ఆదిత్య పబ్లిక్ స్కూల్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయ సిబ్బందితో మాట్లాడారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. హెచ్ఎం వి.అమృత, ఉపాధ్యాయురాలు ఎస్కే బేగం పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాం రైతుబజార్ సమీపంలోగల ఏపీ పించన్‌దారుల సంఘ భవనంలో ఈనెల 24వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జి.జగన్నాథం, డి.గణపతిరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని శ్రీవేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో పదవీ విరమణ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు విద్యుత్, ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు, ఈహెచ్ఎస్ కార్డు ఉన్నవారు పాల్గొనాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు.

26న పాలకొండలో..

పాలకొండ: ఈనెల 26న ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుప్రతి వద్ద సత్యసాయి మందిరం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందన్నారు. ఈ వైద్య శిబిరానికి ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్‌కార్డు, ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని రావాలన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన పంట



నేలకొరిగిన మొక్కజొన్న పంట

కొమరాడ: ఇటీవల వీచిన ఈదురు గాలులకు మొక్కజొన్న పంట నేలకొరిగిందని బట్టిమొగవలస రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు మదుపులుగా పెట్టి మరికొద్ది రోజుల్లో పంట చేతికి అందొస్తుందన్న తరుణంలో ఈదురు గాలులు వీయడం వల్ల పంట నేలకొరిగిందని వారు వాపోయారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పారిశుధ్య కార్మికుల నుంచి వివరాలు సేకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

పార్వతీపురంటౌన్: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని 30 వార్డుల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. వార్డుల్లోని కాలువల్లో పూడికలు తీయడం ప్రారంభించామని చెప్పారు. మలేరియా, డెంగ్యూ నివారణపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో జిల్లా కేంద్రంలో ఎలాంటి పారిశుధ్య నిర్వహణ సమస్యలు తలెత్తకుండా సంబంధిత ప్రజారోగ్య శాఖాధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు.

సీతారామ మందిర పునఃప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: రావుపల్లిలో శుక్రవారం శ్రీసీతారామ మందిర పునః ప్రారంభ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 24వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవతా విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ● మందిర పునఃప్రారంభాన్ని పురస్కరించుకుని మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణుడు గుల్ల సూర్యప్రకాష్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఒడిశాలో సంయుక్త దాడులు



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో సునాబేడా డీఎస్పీ, సిబ్బంది

సాలూరు రూరల్/పాచిపెంట: ఏపీ, ఒడిశా రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలో ఆయా ప్రభుత్వాల పోలీసులు సంయుక్తంగా ఏవోబీలోని ఒడిశా రాష్ట్ర పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఒడిశా నుంచి ఏపీకి సారా దిగుమతిని అరికట్టడంలో భాగంగా ఈ దాడులను నిర్వహించారు. ఈ దాడులకు ఒడిశా రాష్ట్రం సునాబేడా డీఎస్పీ మనోబ్రాత శతపథి నేతృత్వం వహించారు. ఆమె ఆధ్వర్యంలో సుంకి ఎస్ఐ కె.సంఘణ, ఏఎస్ఐ రోహిదాస్ బిడిక, అభయకుమార్ కప్పా, రమేష్ నారాజీ పోర్తి బిషోయ్ తదితరులు పాల్గొన్నారు. ఏపీ నుంచి సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, పాచిపెంట ఎస్ఐ పొదిలాపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల పోలీసులు ఏవోబీ అటవీ ప్రాంతమైన లావిడి, కందిలి, ఆలాసి, పూలగుంత తదితర ప్రాంతాల్లో మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 4500 లీటర్ల సారా, బెల్లం ఊట తదితర వాటిని ధ్వంసం చేశారు. మరో 480 సారా ప్యాకెట్లును స్వాధీనం చేసుకున్నారు. ● **సాలూరు రూరల్:** కొఠియా గ్రూప్ నేరేళ్లవలస కొండ ప్రాంత అడవుల్లోని సారా బట్టీలపై సాలూరు రూరల్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో సారాను, సారా సామగ్రిని ధ్వంసం చేశారు.

కూటమి గెలుపే లక్ష్యం

● ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి



భోగాపురం: పార్టీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న నాగమాధవి

భోగాపురం: జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పూసపాటిరేగ మండలం కనిమెల్ల, కనిమెట్ట గ్రామాలకు చెందిన 100 వైసీపీ కుటుంబాలు జనసేనలో చేరాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ బడ్డుకొండ నుంచి విముక్తి పొందాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాకర్లపూడి శ్రీనివాసరాజు, వరుపుల సుధాకర్, ప్రసాదు లోకం, వందనాల రమణ, నక్కాన రమణ తదితరులు పాల్గొన్నారు. ● **పూసపాటిరేగ:** సైకో ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ఐకమత్యంగా పోరాడాలని నెల్లిమర్ల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి పిలుపునిచ్చారు. శుక్రవారం పూసపాటిరేగలోని మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు స్వగృహంలో టీడీపీ మండల అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పతివాడ అడుగు జాడల్లో నడుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, సువ్వాడ రవిశేఖర్, పతివాడ తమ్మినాయుడు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

కందివలస గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నక్కాన రమణ, తన అనుచరులతో కలిసి శుక్రవారం భోగాపురంలోగల జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాకర్లపూడి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. కందివలస పంచాయతీ పరిధిలోగల సుమారు 200 కుటుంబాలతో ఆయన జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జనపార శివ, బావిశెట్టి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి ఉంటాం

● మాజీ మంత్రి పతివాడ



మాట్లాడుతున్న మాజీ మంత్రి పతివాడ

డెంకాడ: అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి ఉంటామని టీడీపీ నేత, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు స్పష్టంచేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థి లోకం మాధవి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ● ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో అంతులేని అక్రమాలకు పాల్పడిన బడ్డుకొండను సాగనంపాలన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తానని, మూడు పార్టీలు అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ఐదు వేలమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో నిబద్ధతతో పనిచేస్తానని, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోనని, ప్రతి నాయకుడిని, కార్యకర్తను కలుపుకొని ముందుకు వెళ్తానని వాగ్దానం చేశారు. ● నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహంతి చిన్నంనాయుడు, దువ్వాడ రవిశేఖర్, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, మిరాకిల్ అధినేత లోకం ప్రసాద్, గేదెల రాజారావు, కలిదిండి పాణిరాజు, పతివాడ తమ్మినాయుడు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జనసేన పార్టీ నాయకుడు తుమ్మి లక్ష్మీరాజ్, మూడు పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపండి

● మాజీ మంత్రి శత్రుచర్ల ● ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరిక



పార్టీలో చేరినవారితో మాజీ మంత్రి శత్రుచర్ల, ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి

కొమరాడ: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. గుణద గ్రామంలో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖరపాత్రుడు అధ్యక్షతన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శత్రుచర్ల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టీడీపీలోకి చేరిన పలువురు వైసీపీ శ్రేణులను ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి, పార్టీ నాయకులు సుదర్శనరావు, దేవకోటి వెంకటనాయుడు, మధుసూదనరావు, పి.వెంకటనాయుడు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న మధుసూదనరావు

గరుగుబిల్లి: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. మండలంలోని కొంకడివరం, సీతారాంపురం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరిని గెలిపించాలన్నారు. పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తం నాయుడు, ఎం.తవిటి నాయుడు, ఎ.రాంబాబు, కె.సుమన్ భరత్, సర్పంచ్ అల్ల అప్పలనాయుడు, పి.పూర్ణచంద్రరావు, వి.దివాకర్, యడ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

● చీపురుపల్లి రిటర్నింగ్ అధికారి శాంతి



మాట్లాడుతున్న శాంతి

చీపురుపల్లి: రాజకీయ పార్టీలు, ఉద్యోగులు, సంబంధిత వ్యక్తులెవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన పక్షంలో చర్యలు తప్పవని ఆర్డీవో, చీపురుపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శాంతి స్పష్టం చేశారు. తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందన్న విషయాన్ని అందరూ గమనించాలన్నారు. ఎన్నికలతో ముడిపడి ఉన్న ప్రతి పనికీ రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి మంజూరు కోసం సువిధ పేరుతో కొత్త పోర్టల్ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఇంటింటి ప్రచారం మొదలుకుని, సభలు, సమావేశాల కోసం నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకోవాలని ఆర్వో సూచించారు. ఏప్రిల్ నెల 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 3 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు, 3 స్టాటిస్టిక్ సర్వలెన్స్ టీములు, 1 వీడియో సర్వలెన్స్ టీము పని చేస్తున్నాయన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని 160 ప్రదేశాల్లో 257 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకూ నామినేషన్ల దాఖలు చేసుకోవచ్చునని చెప్పారు. నియోజక వర్గం పరిధిలోని తహసీల్దార్లు ఏఆర్వో లుగాను, ఎంపీడీవోలం తా ప్రవర్తనా నియమావళికి నోడల్ అధికారులు గాను వ్యవహరిస్తారని ఆర్వో వివరించారు. కోడ్ అమలులో ఉన్న సమయంలో సరైన ఆధారాలు చూపించకుండా నగదు తీసుకెళ్లకూడదన్నారు. పరిమితికి మించిన నగదు సీజ్ అయిన పక్షంలో జిల్లా స్థాయి కమిటీ ఎదుట సరైన ఆధారాలు సమర్పించి, నగదును వెనక్కి తీసుకోవచ్చునని ఆర్వో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆర్వో శాంతి వివరించారు. ఆమెతో బాటు చీపురుపల్లి తహసీల్దార్ ఎన్.ప్రసాద్‌రావు, డీటీ సంతోష్, ఎంపీడీవో డి.శ్వేత, సీఐ సీహెచ్ షణ్ముఖరావు, ఇతర మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

భోగాపురం: ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా క్రిమినల్ చర్యలు తప్పవని సీఐ ఎ.రవికుమార్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం లింగాలవలసలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాలవలస గ్రామాన్ని సమస్యాత్మక గ్రామంగా గుర్తించడంతో ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. కొంతమంది వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ టీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. ● **గంట్యాడ:** మండలంలోని తాటిపూడి, గంట్యాడ, కొండతామరాపల్లి గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నీలకంఠేశ్వరరావు, ఎస్ఐ బి.సురేంద్రనాయుడు శుక్రవారం సందర్శించారు. ముందుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మోడల్ కోడ్ అమలుపై సిబ్బందితో సమీక్షించారు. ప్రతి గ్రామంలోని మోడల్ కోడ్ అమలు చేయాలని సూచించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

● ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

గరుగుబిల్లి: ప్రజలకు జీవనాధారమైన నీటిని పొదుపుగా వాడుకోవాలని మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు.



మామిడిపల్లిలో నీటి పొదుపుపై విద్యార్థుల ప్రదర్శన



గరుగుబిల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న ఈవోపీఆర్‌డీ, తదితరులు

శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు ప్రసాద్, సీహెచ్ తిరుపతిరావు, వెలుగు గ్రామైక్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** ప్రపంచ జల దినోత్సవాన్ని మామిడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఏపీఎన్జీవో సంస్థ కోఆర్డినేటర్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వక్తలు నీటి పొదుపుపై వివరించారు. అనంతర విద్యార్థులు నీటి పొదుపుపై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.

అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

నెల్లిమర్ల: ఎన్నికల కోడ్ అమలులో ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా వ్యవహరించాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ ఆదేశించారు. నెల్లిమర్లలోని వార్డు సచివాలయాల పరిపాలన, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయరాదని, ఉంటే తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, ఆర్ఐ ఎ.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన



బూరాడపేటలో పర్యటిస్తున్న ఎంపీడీవో

మండలంలోని బూరాడపేట, చినబూరాడపేట గ్రామాల్లో ఎంపీడీవో జి.రామారావు శుక్రవారం పర్యటించారు. ఎన్నికల కోడ్ అమలుపై ఆరా తీశారు. గ్రామంలో పర్యటించి బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడ్ అమలులో సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

● **గరుగుబిల్లి:** గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విధిగా ఎన్నికల నియమావళిని పాటించాల్సిందేనని ఎంపీడీవో పైల సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మండల ఎన్నికల బృంద సభ్యులు పర్యటించారు. గ్రామ స్థాయి అధికారులు ప్రవర్తనా నియమావళిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే వలంటీర్లు ప్రత్యక్షంగా పాల్గొంటే తొలగింపు తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రవిరాంప్రసాద్, బి.గౌరీశంకరరావు, కార్యదర్శి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతరలోనూ నిబంధనలు పాటించాల్సిందే..

భోగాపురం: మండలంలోని భోగాపురం, పోలిపల్లి గ్రామాల్లో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించబోయే జాతర్లలో కూడా ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ ఉత్సవ కమిటీల సభ్యులకు తెలియజేశారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో భోగాపురం, పోలిపల్లి, లింగాలవలస గ్రామాలకు చెందిన నాయకులు, ఉత్సవ కమిటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందిన గుర్తులు, వ్యక్తుల ఫొటోలు, పేర్లు ఎక్కడా ప్రచురించకూడదన్నారు. సీఐ ఎ.రవికుమార్ మాట్లాడుతూ పండగ సందర్భంగా ఎటువంటి అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.చంద్రకళ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న జీడిపప్పు స్వాధీనం

పాలకొండ: డివిజన్ కేంద్రంలోని చెక్‌పోస్టు జంక్షన్ వద్ద శుక్రవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పలాస నుంచి పార్వతీపురం వెళ్తున్న బస్సులో అక్రమంగా తరలిస్తున్న ఏడు బస్తాల జీడిపప్పును అధికారులు సీజ్ చేశారు. ఈ జీడిపప్పు బస్తాలను మార్కెట్ యార్డుకు తరలిస్తున్నట్టు చెప్పారు.

నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి

బొబ్బిలి: ఎన్నికల నిబంధనల ను కచ్చితంగా అమలు చేయాలని మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో పురపాలక, సచివాలయాల సిబ్బందికి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రచారం దగ్గర నుంచి ర్యాలీలు, సభలు, సమావేశాలు ఈసీ నియమావళికి అనుగుణంగా ఉండేలా పర్యవేక్షించాలని, అనుమతి లేకుండా ఎటువంటి కార్యకలాపాలను నిర్వహించరాదని తెలిపారు. బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని, ఇంటింటి ప్రచారంలో భాగంగా స్టిక్కర్లను తొలగించాలని, ఇంటి యజమాని అనుమతి లేకుండా ఎటువంటి జెండాలు ఏర్పాటు చేయరాదని చెప్పారు. మైక్, సౌండ్ సిస్టమ్ వినియోగించేందుకు అనుమ తి తప్పనిసరి పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు, టీపీఎస్ వరప్రసాద్, టీపీఆర్ఓ జగన్మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు రవి, సురేష్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారానికి అనుమతి ఉండాలి

బొబ్బిలి: మండలంలోని పెంట, కొత్తపెంట, రంగరాయపురం, జె.రంగరాయపురం, బూర్జివలసలో ఎన్నికల నిర్వహణాధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు శుక్రవారం తనిఖీలు నిర్వహించాయి. కాగా, బొబ్బిలిలో అనుమతి లేకుండా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటింటా ప్రచారానికి కూడా అనుమతి తప్పనిసరి అని రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ తెలిపారు.

కొఠియాలో సజావుగా ఎన్నికలు నిర్వహిస్తాం

సాలూరు రూరల్: కొఠియా గ్రూపు గ్రామాల్లో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఒడిశా రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నికుంజ బీహారి దహాల్ అన్నారు. కొరాపుట్‌లో శుక్రవారం ఆయన కొరాపుట్, రాయగడ, నవరంగపూర్, మల్కనగిరి (అన్ డివైడెడ్ కొరాపుట్) జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్ మాట్లాడుతూ కొఠియా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో ఇప్పటికే చర్చించినట్టు చెప్పారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

సాలూరు రూరల్: సాలూరు పట్టణంలో శుక్రవారం క్షయ వ్యాధిపై టీబీ సూపర్‌వైజర్ నరేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా క్షయపై అవగాహన కల్పించారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం